# 179 బిడ్లు.. రూ.56.74 కోట్లు

## చిన్నతరహా ఖనిజాల మొదటి దశ వేలం పూర్తి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిన్న తరహా ఖనిజాల మొదటి దశ వేలం విజయవంతంగా పూర్తయినట్టు గనుల శాఖ ప్రకటించింది. దీనిలో భాగంగా మూడు ఖనిజాలకు సంబంధించిన 25 బ్లాకుల్లో 19 బ్లాకులకు ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో రూ.56.74 కోట్లకు బిడ్లు దాఖలైనట్టు వెల్లడించింది. వీటిలో ఓ కలర్ గ్రానైట్ బ్లాక్ (3.61 హెక్టార్లు)తోపాటు 4 లాటరైట్ బ్లాకులు (15.834 హెక్టార్లు), 14 స్టోన్ అండ్ మెటల్ బ్లాకులు (47.125 హెకార్లు) ఉన్నట్టు వివరించింది. వీటి రిజర్వు ధర రూ.5,63,62,600గా నిర్ణయించగా.. తుది బిడ్ మొత్తం రూ.56,74,12,600గా ఉన్నట్టు తెలిపింది. మొత్తం 179 బిడ్లు దాఖలైనట్టు పేర్కొన్నది. ఇక ప్రతినెలా ఖనిజాల వేలం నిర్వహించాలని భావిస్తున్నది.

### వేలం వేసిన ఖనిజాల వివరాలు

| ఖనిజం | వేలం వేసిన బ్లాకులు | టీక్యూబీల సంఖ్య | రిజర్వు ధర (రూ.) | తుది బిడ్ మొత్తం (రూ.) |
|---|---|---|---|---|
| కలర్ గ్రానైట్ | 1 | 5 | 29,04,000 | 4,99,79,000 |
| లాటరైట్ | 4 | 39 | 63,33,600 | 15,89,58,600 |
| స్టోన్ అండ్ మెటల్ | 14 | 84 | 4,71,25,000 | 35,84,75,000 |
| మొత్తం | 19 | 128 | 5,63,62,600 | 56,74,12,600 |

# గ్రాన్యూల్స్ లాభం 152 కోట్లు

హైదరాబాద్, మే 28: ప్రముఖ ఫార్మా దిగ్గజం గ్రాన్యూల్స్ ఇండియా నికర లాభంలో 17 శాతం వృద్ధిని కనబరిచింది. ఫార్ములేషన్ విభాగంలో అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.152 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.130 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,176 కోట్ల నుంచి రూ.1,197 కోట్లకు పెరిగినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.4,482 కోట్ల ఆదాయంపై రూ.501 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని గడించింది. మరోవైపు రూ.1 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.1.5 తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.



# పారిశ్రామికానికి బీటలు

## ఎనిమిది నెలల కనిష్ఠస్థాయికి పడిపోయిన వృద్ధి

- ఏప్రిల్ నెలలో 2.7 శాతంగా నమోదైన ఐఐపీ
- గతేడాదితో పోలిస్తే పడిపోయిన ప్రగతి

న్యూఢిల్లీ, మే 28: పారిశ్రామికం మళ్లీ పడకేసింది. ఆర్థిక వృద్ధిలో నాలుగో స్థానానికి చేరుకోనున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ సర్కార్‌కు పారిశ్రామిక ప్రగతి రూపంలో గట్టి షాక్ తగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే ఢీలాపడింది. ఏప్రిల్ నెలలో కేవలం 2.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.2 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. మార్చి నెలలో నమోదైన వృద్ధి రికార్డు స్థాయిలో పెరుగుతూ వచ్చిన పారిశ్రామిక ప్రగతికి బ్రేకులు పడ్డాయి. తయారీ రంగంతోపాటు గనులు, విద్యుత్ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో ఐఐపీ ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. రేటును మళ్లీ సవరించింది. గతంలో 3 శాతంగా ఉంటుందని అంచనాను విడుదల చేసిన గణాంకాల శాఖ ఈసారి దీనిని 3.9 శాతానికి సవరించింది.

### ఢీలా పడిన తయారీ, గనులు

దేశ వృద్ధి, పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న తయారీ రంగంలో నిస్తేజం ఆవహించింది. గత కొన్ని నెలలుగా పరుగులు పెట్టిన తయారీ రంగం వెనుకంజవేసింది. గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి 3.4 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 4.2 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. దీంతోపాటు గనుల రంగంలో వృద్ధి ప్రతికూలానికి పడిపోయింది. దేశవ్యాప్తంగా ఉన్న గనుల్లో ఖనిజ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి మైనస్ 0.2 శాతానికి పడిపోయింది. అంతక్రితం ఏడాది ఇది 6.8 శాతంగా నమోదైంది. అలాగే విద్యుత్ రంగంలో వృద్ధి ఒక్క శాతానికి పరిమితమైంది. ఏప్రిల్ 2024లో ఇది 10.2 శాతంగా ఉన్నది.

### క్యాపిటల్ గూడ్స్ సెగ్మెంట్ ఫర్వాలేదు..

ఇతర రంగాలతో పోలిస్తే క్యాపిటల్ గూడ్స్ రంగం అంచనాలకుమించి రాణించింది. గత నెలలో ఈ రంగంలో వృద్ధి 20.3 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం ఇదే నెలలో నమోదైన 2.8 శాతంతో పోలిస్తే భారీగా పెరిగింది. ఏడాది క్రితం ఇదే నెలలో 10.5 శాతం వృద్ధిని కనబరిచిన కన్జ్యూమర్ డ్యూరబుల్ విభాగం ఈసారికిగాను 6.4 శాతంతో సరిపెట్టుకున్నది. మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు కూడా పడకేశాయి. ఈ రెండు విభాగాలు నాలుగు శాతం వృద్ధితో సరిపెట్టుకున్నాయి. గతేడాది వచ్చిన వృద్ధి 8.5 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. ప్రాథమిక వస్తువులు 0.4 శాతం మాత్రమే కనబరిచాయి.

### కీలక రంగాలది అదే దారి

కీలక రంగాలు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలకుగాను ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి పడిపోతూ 0.5 శాతంగా నమోదైంది. క్రూడాయిల్, సహజ వాయువు రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణం. ప్రతీకార సుంకాలపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో గతేడాది 4.6 శాతంగా నమోదైన వృద్ధి ఈసారి తిరోగమన బాటపట్టింది.



| రంగం | ఏప్రిల్-2025 | ఏప్రిల్-2024 |
|---|---|---|
| పారిశ్రామిక ప్రగతి | 2.7% | 5.2% |
| తయారీరంగ వృద్ధి | 3.4% | 4.2% |
| గనుల రంగ వృద్ధి | -0.2% | 6.8% |
| విద్యుత్ రంగం | 1% | 10.2% |
| ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/నిర్మాణ రంగం | 4% | 8.5% |
| ప్రాథమిక వస్తువుల అవుట్‌పుట్ | -0.4% | 7% |

# రెండోరోజూ నష్టాల్లో సూచీలు

ముంబై, మే 28: స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ రంగ సంస్థ ఐటీసీ షేరు కుదేలవడం మొత్తం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఒక దశలో 300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 239.31 పాయింట్లు కోల్పోయి 81,312.32 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 73.75 పాయింట్లు కోల్పోయి 24,752.45 వద్ద స్థిరపడింది. ఈవారంలోనే జీడీపీ గణాంకాలతోపాటు పారిశ్రామిక సూచీ విడుదలకానుండటంతో మదుపరులు అప్రమత్తకు మొగ్గుచూపారు. ఫలితంగా ఎఫ్ఎంసీజీ, వాహన, ఫార్మా రంగ షేర్లు పతనం చెందగా..బ్యాంకింగ్, పీఎస్‌యూ, మీడియా, ఎనర్జీ రంగ షేర్లు కదంతొక్కాయి. బ్రిటిష్ మల్టినేషనల్ బీఏటీ సంస్థ ఐటీసీలో తన వాటాను 2.5 శాతం మేర తగ్గించుకుంటున్నట్టు ప్రకటించడంతో ఐటీసీ షేరు కుప్పకూలింది. ఒక దశలో ఐదు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3 శాతం నష్టపోయింది. దీంతోపాటు ఇండస్‌ఇండ్, నెస్లె, అల్ట్రాటెక్, మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా షేర్లు పతనం చెందాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా ఎఫ్ఎంసీజీ 1.33 శాతం నష్టపోగా, మెటల్, వాహన, కన్జ్యూమర్ డ్యూరబుల్, కమోడిటీస్ షేర్లు దిగువముఖం పట్టాయి. కానీ, ఆర్థిక సేవలు, ఇండస్ట్రియల్స్, టెలికాం, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.



# డీ-మెర్జ్ కానున్న బీఏఎస్ఎఫ్

హైదరాబాద్, మే 28: ప్రముఖ పురుగుల మందుల తయారీ సంస్థ బీఏఎస్ఎఫ్..దేశీయ మార్కెట్లోకి మరో రెండు రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి పంటపై వచ్చే పాముపొడ తెగులు నివారణ కోసం వాలెక్సియోతోపాటు సుడి దోమను నియంత్రించే శిలీంద్రనాశిని మిబెల్యాను ప్రవేశపెట్టినట్టు కంపెనీ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ తెలిపారు. వీటిలో వాలెక్సియో 60 ఎంఎల్ ధర రూ.1,750గాను, మిబెల్యా 120 ఎంఎల్ ధర రూ.1.090గా నిర్ణయించింది. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ప్రతియేటా 2 ఉత్పత్తుల చొప్పున 10 రకాల కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని వేరుచేసే ప్రక్రియ కొనసాగుతున్నదని, వచ్చే 18 నుంచి 24 నెలల్లో ఇది పూర్తికానున్నట్టు చెప్పారు.

# ఎస్బీఐ 26 వేల కోట్ల రైటాఫ్

*2024-25లో భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేసిన బ్యాంకింగ్ దిగ్గజం*




న్యూఢిల్లీ, మే 28: ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ బ్యాంకులు భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేశాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వరంగ బ్యాంకుల కన్నా ప్రైవేట్ రంగ బ్యాంకులు అన్ సెక్యూర్డ్ రుణాలను పెద్దమొత్తంలో రైటాఫ్ చేశాయి. వీటిలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అత్యధికంగా రూ.26 వేల కోట్లకు పైగా రుణాలను తన బ్యాలెన్స్ షీట్స్ నుంచి తీసివేసింది. అంతక్రితం ఏడాది రైటాఫ్ చేసిన రూ.17,645 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రూ.10 వేల కోట్లకు పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులు అధిక మొత్తంలో రుణాలను రైటాఫ్ చేయడం విశేషం. గతేడాది ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,271 కోట్ల రుణాలను తన ఖాతా పుస్తకం నుంచి తొలగించింది. 2023-24లో రైటాఫ్ చేసిన రూ.6,091 కోట్ల కంటే ఇది 50 శాతం అధికం. అలాగే యాక్సిస్ బ్యాంక్ కూడా రూ.11,833 కోట్ల మొండి బకాయిలను తన ఖాతాలోంచి తీసివేసింది.

### ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాలే..

చిన్నస్థాయి రుణాలు తీసుకొని ఎగ్గొట్టే వారు అధికంగా ఉంటున్నారని రిజర్వు బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిలో ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రంగాల్లో అత్యధికంగా ఉంటున్నాయని, వీటిని తగ్గించడానికి బ్యాంకులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని హెచ్చరిస్తున్నది. పూచీకత్తు లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నాయని, వీటి వల్ల ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులపై ప్రతికూల ప్రభావం పడనున్నదని గతంలోనే రిజర్వు బ్యాంక్ హెచ్చరించింది. అయినప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడం మానడం లేదు. కఠిన నిబంధనలు విధించడం వల్ల బ్యాంకుల రుణ వితరణకు బ్రేక్‌లు వేయవచ్చునని, దీనివల్ల చిన్న వ్యాపారాలు, వ్యక్తులు, రుణాలు పొందడం కష్టతరం కానున్నది. అయినప్పటికీ గడిచిన మూడేండ్లలో రైటాఫ్ అయిన రుణాల్లో 20 శాతం రికవరి కావడం విశేషం.


## ప్రముఖ కళాకారుడు శ్యామలరావు మృతి


శ్యామలరావు(ఫైల్)

కరీమాబాద్, మే 28: ప్రముఖ కళాకారుడు, దర్శకుడు, మయూరి ఆర్ట్ క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు శతపతి శ్యామలరావు(66) అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. ఉర్సులోని వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. గురువుగా నగర ప్రజలకు, కళాకారుడిగా రాష్ట్రంలోని కళాభిమానులకు సుపరిచితుడు. 1982లో ఉర్సులోని వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో 'కళాజ్యోతి' పేరున సంస్థ స్థాపించారు. పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులతో నాడు కళాప్రదర్శనలు ఇచ్చారు. కళాకారులుందరూ సమష్టిగా 1985లో మయూరి ఆర్ట్ క్రియేషన్స్‌గా మార్చుకున్నారు. మయూరి ఆర్ట్ క్రియేషన్స్ వారు ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 200లకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. శ్యామలరావు మృతికి కళాకారులు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

**సహృదయ సాహితీ సంస్థ సభ్యుల సంతాపం**

పోచమ్మమైదాన్ : ప్రముఖ రంగస్థల నటుడు శ్యామలరావు మృతిపై వరంగల్ సహృదయ సాహితీ సంస్థ సభ్యులు సంతాపం ప్రకటించారు. తెలుగు నాటకరంగంలో దర్శకుడిగా, నటుడిగా, నాటకాలే శ్వాస, ధ్యాసగా జీవిస్తూ కన్నుమూసిన శ్యామలరావు నాటకరంగ సేవలు మరువలేనివని కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహర్ బాబు, ఎన్వీఎన్‌చారి, వనం లక్ష్మీకాంతారావు, తెలంగాణ నాటక సమాచార సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, వరంగల్ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు మాడిశెట్టి రమేశ్, ఆకుతోట లక్ష్మణ్, హనుమకొండ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఓడపల్లి చక్రపాణి, కార్యదర్శి దేవరాజు రవీందర్ ఉన్నారు.


పూరిగుడిసెలో నివాసముంటున్న వృద్ధ దంపతులు

# వృద్ధ దంపతులకు ఆపద

- కళ్లు, కాళ్లు పని చేయని వైనం
- ముగ్గురు సంతానం మృతితో నా అనేవారు కరువు
- అంతిమ ఘడియల్లో ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

నల్లబెల్లి, మే 28: కన్న పెంచిన పిల్లలు కాటికి పోయారు.. పనిచేద్దామంటే జవసత్తువలు లేవు. భార్యకు కళ్లు లేవు.. భర్తకు కళ్లు, కాళ్లు పని చేయవు. ఊరికి దూరమవుతూ.. కాటికి దగ్గరవుతున్న తరుణంలో అంతిమ ఘడియల్లో ఆపన్నహస్తం కోసం వృద్ధ దంపతులు ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మేకల రాములు, కనకమ్మ దంపతులు ఊరికి ఆమడ దూరంలో పూరిగడిసె వేసుకొని కొన్నేండ్లుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి దుర్గయ్య, కాంతయ్య, సమ్మక్క అనే ముగ్గురు సంతానం. ముగ్గురూ వివాహాల అనంతరం వివిధ కారణాలతో మృత్యువాత పడ్డారు. వీరి యానాది సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో కాళ్లురెక్కలు ఆడినప్పుడు సమీప అడవుల్లో పలు రకాల గడ్డలు సేకరించడం, చేపలు పట్టి సమీప గ్రామాల్లో విక్రయించి పొట్టపోసుకునేవారు. ముగ్గురు పిల్లల మృతితో నేడు వృద్ధాప్యంలో ఉన్న ఆ దంపతులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం రూ. 2 వేల ఆసరా పింఛన్, 12 కిలోల రేషన్ బియ్యం వారి జీవనాధారంగా మారింది. అయితే, కళ్లు కనిపించకపోవడంతో రేషన్‌తోపాటు పింఛన్ తీసుకోలేని దుర్భర పరిస్థితుల్లో ఆ ఆ వృద్ధులు కొట్టుమిట్టాడుతున్నారు. ఉన్నతాధికారులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, వృద్ధాశ్రమాల నిర్వాహకులు స్పందించి అభాగ్యులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- 45 రోజులుగా కాంటాలకు నోచుకోని వడ్లు
- తేమశాతంలో హెచ్చుతగ్గులు
- ధాన్యం ఆరబోసేందుకు ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- వర్షాల నేపథ్యంలో వేగవంతం చేయాలంటున్న రైతులు


బండమీదిమామిడితండాలో నిల్వ ఉన్న ధాన్యం

ఖానాపురం, మే 28: పాకాల ఆయకట్టులో ధాన్యం కొనుగోళ్ల నత్తను మరిపిస్తున్నాయి. ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కరువై వెరసి ధాన్యం కొనుగోళ్లు రైతులు పాలిట శాపంగా మారాయి. గతంలో యాసంగి సాగులో ధాన్యం విక్రయించుకోవడం చాలా సులభం. రైతులు పంటకోసినాక రెండు నుంచి మూడు రోజులుపాటు ఆరబెట్టుకుని పంట విక్రయించుకునేవారు. కానీ, ఈ యాసంగిలో పాకాల ఆయకట్టు రైతులు ఎన్నడూ చూడని కష్టాలు చవి చూస్తున్నారు. ఒకటి రెండు కాదు.. 45 రోజుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే రైతులు పడిగాపులు కాస్తున్నారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా తయారైందో తెలుస్తున్నది. పగలంతా ధాన్యం ఆరబోసుకోవడం, సాయంత్రానికి పరదాలు కప్పుకోవడం రైతులకు నిత్యకృత్యంగా మారింది. తాజాగా బండమీదిమామిడితండా కొనుగోలు కేంద్రంలో కొందరు రైతులు 45రోజులుగా, మరికొందరు రైతులు నెల, 20 రోజులకు పైగా ధాన్యం కొనుగోళ్లు కాక అష్టకష్టాలు పడుతున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిపిపోతుండడంతో మళ్లీ తేమశాతం పెరుగుతున్నది. ధాన్యాన్ని రోజుల తరబడి ఆరబెట్టడం వల్ల బరువు తగ్గిపోతున్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బండమీదిమామిడితండాలోని కొనుగోలు కేంద్రంలో నిత్యం ఇదే తంతు జరుగుతున్నది. అధికారులు పట్టించుకోకపోవడంతోనే రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. రైతులు 45 రోజులుగా పనులు మానుకుని ధాన్యం కొనుగోళ్ల కోసమే ఎదురుచూస్తున్నారు. ఇంతటి దౌర్భాగ్య పరిస్థితులు గతంలో ఏనాడూ ఎదురు కాలేదని రైతులు చెబుతున్నారు. బండమీదిమామిడితండాలో ఇప్పటివరకు 20 శాతం కాంటాలు మాత్రమే అయ్యాయని, 80 శాతం కావాల్సి ఉందని వాపోతున్నారు. ఇంకా 15 లారీల ధాన్యం ఉందని, అధికారులు కాంటాలను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.


### 45 రోజులైనా కాంటాలు కాలేదు..



గత ఏప్రిల్ 11న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన. ఇప్పటి వరకు నా ధాన్యం కాం టా కాలేదు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన 4రోజులకే తేమ శాతం 17 వచ్చింది. కానీ, అప్పుడు కాంటా పెట్టలేదు. రోజుల తరబడి ఎదురుచూశాను. వర్షాలు మొదలు కావడంతో ఒకరోజు తేమశాతం నిబంధనల ప్రకారం వస్తున్నది. మరొక రోజు ఎక్కువగా వస్తున్నది. దీంతో రోజూ కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ ఉంటున్నా. ఇంకా ఎప్పుడు కాంటా అవుతుందో తెల్వడం లేదు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలె.

*- బోడ నరేశ్ రైతు బండమీదిమామిడితండా*

### రోజూ ఆరబెడుతున్నా..



పాకాల ఆయకట్టులో ఐదెకరాల్లో వరి సాగు చేసిన. గత ఏప్రిల్ 18న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన. మొదటి వారంలోనే ధాన్యం ఆరింది. తేమశాతం 17 లోపే వచ్చింది. కాంటా కాకపోవడంతో వర్షానికి తడిసింది. అప్పటి నుంచి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ ధాన్యాన్ని ఆరబెట్టడం, సాయంత్రానికి పరదాలు కప్పడం ఇదేపనిగా మారింది. ధాన్యాన్ని తిరగేయడానికి రోజూ కూలీలను పెడుతున్న. దీంతో ఖర్చు పెరుగుతున్నది. ధాన్యం మాత్రం కాంటాలు కావడం లేదు. ఒక్క అధికారి కూడా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించడం లేదు.

*- బోడ వెంకటేశ్, రైతు, బండమీదిమామిడితండా*

# అడుగడుగునా గుంతలే..

- అధ్వానంగా శివనగర్-చింతల్ రోడ్డు
- వాహనదారులకు నరకంగా మారిన ప్రయాణం


ఖిలావరంగల్, మే 28: అడుగడుగునా గుంతలతో రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. వర్షం పడితే ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి శివనగర్ రైల్వేస్టేషన్ మీదుగా చింతల్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. అండర్ రైల్వేగేటు ప్రాంతంతోపాటు విలీన గ్రామాల ప్రజలు ఎక్కువగా శివనగర్ మీదుగా రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అలాగే, ఖిలావరంగల్, సంగెం మండలాలకు చెందిన ప్రజలు బైక్‌లు, ఆటోల్లో ఎక్కువగా తూర్పుకోట, చింతల్, శివనగర్ మీదుగా హంటర్‌రోడ్డు, వరంగల్‌కు వివిధ పనుల కోసం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రైల్వేస్టేషన్‌కు సుమారు 500 మీటర్ల రోడ్డు ఉంది. ఈ రోడ్డుపై అడుగుకో గుంత ఉండడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, చింతల్ నుంచి రైల్వేస్టేషన్ వరకు సుమారు 600 మీటర్ల రోడ్డుపై ప్రమాదం పొంచి ఉందని స్థానికులు తెలిపారు. చింతల్ ఆర్వోబీ నుంచి శివనగర్ మీదుగా అండర్ గ్రౌండ్ డక్ట్ (భూగర్భ వరద కాల్వ) నిర్మాణం పనులు కొన్ని రోజుల క్రితం నిలిచిపోయాయి. దీంతో ఆర్వోబీ నుంచి రైల్వేస్టేషన్ సమీపం వరకు ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. కొత్తగా వచ్చే వారు ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తే భూగర్భ వరద కాల్వలో పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. చింతల్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు సుమారు కిలో మీటరుకు పైగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అండర గ్రౌండ్ డక్ట్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


చింతల్ నుంచి అండర్ బ్రిడ్జి వెళ్లే రోడ్డుపై పడిన గుంతలో నిలిచిన వర్షపునీరు

# రోడ్డు వేశారు.. డ్రైనేజీ మరిచారు..

### గౌతమీనగర్‌లో ప్రజల అవస్థలు


డ్రైనేజీ లేక కూరుకుపోయిన మట్టి


సీసీరోడ్డుపై ఏర్పడిన పగుళ్లు

పోచమ్మమైదాన్, మే 28: వరంగల్ 12వ డివిజన్ గౌతమీనగర్ (డాక్టర్స్ కాలనీ-1) లో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టి, డ్రైనేజీ నిర్మాణం మరిచారు. దీంతో కాలనీలో మట్టికుప్పలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా వర్షాలు పడినప్పుడు రోడ్డు పైనుంచి వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరి ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా నాలుగు నెలల నుంచి సంబంధిత కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తునారు. స్మార్ట్‌సిటీ నిధులు రూ. 40 లక్షలను గౌతమీనగర్‌లో సీసీరోడ్డు, డ్రైనేజీ కోసం మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ నాలుగు నెలల క్రితం కాల్వల కోసం గుంతలు తవ్వి, సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాడు. కొత్త రోడ్డు వేశారన్న సంతోషం లేకుండా పోయింది. డ్రైనేజీ కోసం తవ్విన గుంతల వల్ల రాకపోకలకు సమస్యగా మారింది. అలాగే, నాలుగు నెలలకే సీసీ రోడ్డుపై పగుళ్లు ఏర్పడ్డాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై క్యూరింగ్ సరిగాలేక పగుళ్లు ఏర్పడ్డాయని చెబుతున్నారు. వర్షాలు ముంచుకొస్తున్నందున అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కేతిరెడ్డి విజేందర్‌రెడ్డి, ముత్తినేని రాజేందర్ బాబు మాట్లాడుతూ గౌతమీనగర్‌లో సమస్యలపై అధికారులకు పలుసార్లు గ్రీవెన్స్ సెల్‌లో విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వర్షాకాలంలో నేరుగా ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్నాయన్నారు.

# అధికారుల సమన్వయంతోనే విజయవంతం

- సరస్వతీ పుష్కరాలకు 30 లక్షలకు పైగా భక్తులు
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి రూరల్/మహదేవపూర్(కాళేశ్వరం), మే 28 : అధికారుల సమన్వయంతో సరస్వతీ పుష్కరాలు విజయవంతం చేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. పుష్కరాలకు 30 లక్షలకు పైగా భక్తులు వచ్చారని, ఎప్పటికప్పుడు వారితో ముఖాముఖి అవుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. పుష్కరాల నిర్వహణ చాలా సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఈ అనుభవం రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎస్పీ కిరణ్‌ఖరే మాట్లాడుతూ పుష్కరాలకు మూడు వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అటవీ ప్రాంతం కావడం, మధ్యలో వర్షం రావడం, తద్వారా రవాణాకు ఇబ్బందులు ఎదురైనా అధిగమించామని తెలిపారు. పార్కింగ్ ఏరియాలు ఏర్పాటు చేసేందుకు ఇబ్బందులు వచ్చాయన్నారు. సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పీ బోనాల కిషన్, డీపీఆర్వో శ్రీనివాస్, కాటారం డీఎస్పీ రామిరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, పక్కన ఎస్పీ

**రూ.2.83కోట్ల ఆదాయం**

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం ఆదాయాన్ని ఈవో మహేశ్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా సహాయ కమిషనర్ ఆర్ సునీత సమక్షంలో బుధవారం లెక్కించారు. సరస్వతీ పుష్కరాలు 12 రోజులతో సహా మొత్తం 64 రోజులకు రూ.2,83,18,651 ఆదాయం వచ్చిందన్నారు. గదుల ద్వారా రూ.1.71 లక్షలు, హోమాల ద్వారా రూ.1.23 లక్షలు, శీఘ్రదర్శనం ద్వారా రూ.5.60 లక్షలు, ప్రసాదాల ద్వారా రూ.13,83,6552, హుండీల ఆదాయం రూ.1,36,28,099 సమకూరినట్లు చెప్పారు. మిశ్రమ బంగారం 15 గ్రాము లు, మిశ్రమ వెండి 1-750 గ్రాములు వచ్చిందని ఈవో తెలిపారు. హుండీల పర్యవేక్షణ అధికారిగా నందనం కవిత హాజరయ్యారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, పుష్కరాల ఉత్సవ కమిటీ సభ్యులు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, దేవస్థా నం సిబ్బంది, అన్నమయ్య, శ్రీవల్లీ సేవా ట్రస్ట్ కరీంనగర్ సభ్యులు, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి కామారెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

**ఆర్టీసీకి రూ.6.29 కోట్ల ఆదాయం**

హనుమకొండ చౌరస్తా : సరస్వతీ పుష్కరాల సందర్భంగా ఆర్టీసీకి రూ.6.29 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నెల 15 నుంచి 26 వరకు వరంగల్ రీజియన్ పరిధిలోని 9 డిపోల నుంచి కాళేశ్వరానికి సంస్థ ప్రత్యేక బస్సులు నడిపించింది. మొత్తం 1503 బస్సు లు 5047 ట్రిప్పులు(6,28,586 కిలోమీటర్లు) తిరి గాయని 15న 13,877 మంది, 23న 45,609 మంది చివరి రోజు సోమవారం 56,698 కలిపి మొత్తం 4,36,189 మంది ప్రయాణించినట్లు ఆర్ఎండీ విజయభాను తెలిపారు. పుష్కరాలతో ఆర్టీసీ ఖజానాకు దండిగా ఆదాయం రాగా, బస్సు టికెట్ల ధరలు ఎక్కువగా పెంచిందని ప్రయాణికులు మండిపడడం గమనార్హం.